

## మళ్లీ సెప్టెంబరులో ముహుర్తాల్లేవ్..

ఆదివారం నుంచి శుభముహూర్తాలు ప్రారంభమవుతాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. సెప్టెంబరు నెలలో భాద్రపద మాసంలో మాత్రం ముహూర్తాలు లేవు. తిరిగి ఆశ్వయుజ, కార్తీక, మార్గశిర మాసాల్లో అంటే అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో ముహూర్తాలు ఉన్నాయి.. తల్లిదండ్రులు కంగారుపడకుండా పెళ్లిళ్లు చేసుకోవచ్చు.. ఒక నెలలో మాత్రమే ముహూర్తాల్లేవ్..

**- కారుపర్తి నాగమల్లేశ్వర సిద్ధాంతి, శుభతిథి గంటల పంచాంగకర్త, పుల్లేటికుర్రు**

# పెళ్లి కళ వచ్చేసిందే బాలా..

## ఈ నెల 7 నుంచే మోగనుంది కల్యాణవీణ

- 7 నుంచే ఆరంభం
- 12 రోజులు మంచి ముహూర్తాలు
- మూడు నెలల తర్వాత శుభఘడియలు
- ఏర్పాట్లలో తల్లిదండ్రులు







**కాకినాడ (ఆంధ్రజ్యోతి)/అన్నవరం/మండపేట :** మోగనుంది పెళ్లి బాజా. మూఢం.. శూన్యమాసం.. కారణంగా మార్చి నెల నుంచి ముహూర్తాలు లేవు.. అందరూ మంచిరోజులకు ఎదురుచూస్తున్నారు. మూడు నెలల విరామం తర్వాత ముహూర్తాలు భారీగా ఉండడంతో పెళ్లి సందడి నెలకొంది. దీంతో ఉమ్మడి జిల్లాలో మళ్లీ పెళ్లి బాజాలు భారీగా మోగ నున్నాయి. భారీ ఎత్తున పెళ్లిళ్లు చేయడానికి వధూవరుల కుటుంబాలు ఉరుకులు, పరుగులు పెడుతున్నాయి. నగలు, వస్త్రాలు, కల్యాణ మండపాలు, సన్నాయి, కేటరింగ్‌కు డిమాండ్ ఏర్పడింది. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంలో నగలు, వస్త్ర దుకాణాల్లో అప్పుడే షాపింగ్ కళ పెరిగిపోయింది. బంగారం ధర కాస్త తగ్గడంతో ఇదే మంచి సమయంగా కోట్లలో కొనుగోళ్లు జరుగుతున్నాయి.

### మరో రెండు రోజుల్లోనే శ్రావణం..

ఈనెల 5 నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుంది. ఈ నెల 7 నుంచి భారీగా వివాహ ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణమాసంలో మొత్తం 14 రోజులు వివాహాలకు శుభ ఘడియలుగా పండితులు చెబుతున్నారు. దీంతో ఎక్కడికక్కడ పెద్దఎత్తున ముహూర్తాలు ఖరారయ్యాయి. ముఖ్యంగా ఈనెల 18, 22, 23 తేదీల్లో అయితే ఉమ్మడి జిల్లాలో వేలల్లో పెళ్లిళ్లు ఉన్నాయి. మూడు జిల్లాల్లో కలిపి దాదాపు 26 వేలకు పైగా వివాహాలు జరిగే అవకాశం ఉందని అంచనా. ఈ నేపథ్యంలో ఆభరణాలు, వస్త్రాలు, డెకరేషన్, మండపాలు, సన్నాయి, కేటరింగ్ కలిపి మొత్తం రూ.520 కోట్లకుపైగా వ్యాపార లావాదేవీలు జరగవచ్చని వర్తక సంఘాలు విశ్లేషిస్తున్నాయి.

### మంచి ముహూర్తాలు ఇవే..

ప్రధానంగా ఈ నెలలో 7, 8, 9, 10, 13, 15, 17, 18, 19, 22, 23, 24 తేదీలు వివాహాలకు అత్యంత అనుకూలమని పంచాంగకర్తలు ప్రకటించారు. వీటిలో అత్యంత బలమైన ముహూర్తాలుగా 17, 18, 22, 23 తేదీలను పేర్కొన్నారు. దీంతో ఆయా తేదీల్లో కల్యాణ మండపాలకు యమ డిమాండ్ ఏర్పడింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కల్యాణ మండపం దొరకడం గగనమైపోతోంది. అసలు వర్షాకాలం కావడంతో కల్యాణ మండపం తప్పనిసరిగా మారింది. ఇక కొంత మంది తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లల వివాహాలు దైవ సన్నిధిలో చేసుకుంటే వారి వైవాహిక జీవితం కష్టాలు లేకుండా సాగుతుందని భావిస్తుంటారు. ఆనవాయితీగా కూడా అలా చేస్తారు. రాష్ట్రంలో తిరుపతి తర్వాత అన్నవరం, ద్వారకాతిరుమలలో అధిక సంఖ్యలో వివాహాలు జరుగుతంటాయి. అన్నవరంలో ఏడాదికి 8 నుంచి 10 వేల జంటలు సత్యదేవుడి సాక్షిగా ఒక్కటవుతుంటాయి. శ్రావణమాసం నేపథ్యంలో సత్యదేవుడి సన్నిధిలో వివాహ మండపాలన్నీ బుకింగ్ జరిగిపోయాయి. బలమైన ముహూర్తాలున్న నాలుగు రోజుల్లో అయితే కొండపై వెయ్యికిపైగా వివాహాలు జరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అన్నవరం కొండపై సత్రం గదులకు సైతం భారీ డిమాండ్ నెలకొంది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు భారీగా రావడంతో గదుల కేటాయింపుపై ఏంచేయాలో తెలీక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

### ఖర్చు రూ.కోట్లలో..

కాకినాడ జిల్లావ్యాప్తంగా పల్లెలు, పట్టణాలన్నీ కలిపి 10 వేలకు పైగా వివాహాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. రాజమహేంద్రవరం జిల్లా 7 వేలు, కోనసీమ జిల్లావ్యాప్తంగా 9 వేలకుపైగా పెళ్లిళ్లు జరుగుతాయని అంచనా. సరాసరి ఒక్కో వివాహానికి కనీసం రెండు లక్షలు ఖర్చు చేసినా రూ.520 కోట్ల వరకు వ్యాపార లావాదేవీలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా మూడునెలలుగా గిరాకీ లేని పూల డెకరేషన్, బంగారం దుకాణాలు, క్యాటరింగ్, పురోహితులు, సన్నాయి, ఈవెంట్ ఆర్గనైజింగ్ తదితర రంగాల వ్యాపారం భారీగా పుంజుకోనుంది. ఇప్పటికే ఏ బంగారం దుకాణం చూసినా కిక్కిరిసి కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఆభరణాల కొనుగోళ్లే రూ.150 కోట్లు దాటిపోతాయని అంచనా. పురోహితులు, మంగళ వాయిద్యకారులకు విపరీతమైన డిమాండ్ నెలకొంది.

### సందడే సందడి..

పెళ్లి అనే రెండక్షరాల బంధం ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత కీలకమైంది. తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తు కోసం ఆచితూచి శుభఘడియలను ఎంచుకుని ముడేస్తారు. తద్వారా వారి వివాహ బంధం జీవితకాలం ఎలాంటి ఆటుపోట్లకు లోనవకుండా ఉండాలని కోరుకుంటుంటారు. ఈ వివాహాలకు ఏప్రిల్ తర్వాత మూడు నెలల విరామం వచ్చింది. రెండు నెలల మూఢం, మరో నెల శూన్య మాసం రావడంతో మంచి ముహూర్తాలే లేవు. దీంతో వివాహాలన్నీ వాయిదా పడ్డాయి. ఇప్పుడు శ్రావణమాసం ప్రారంభం అవు తుండడంతో మూడు నెలల తర్వాత తిరిగి పెళ్లి కళ వచ్చేసింది. వివాహాలకు శ్రావణం శుభకరమని పండితులు చెబుతారు. ఈనెల 5 నుంచి శ్రావణమాసం ప్రారంభం కాగా 7 నుంచి వివాహ ముహూర్తాలు ప్రారంభం అవుతున్నాయి. దీంతో వేలాది మంది పెళ్లి ముహూర్తాలు ఖరారు చేసుకుంటున్నారు. వచ్చేవి మంచిరోజులు కావడంతో గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, ఉపనయనాలు వంటి శుభకార్యాలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేసుకుంటు న్నారు. ఈనెల తప్పితే మళ్లీ భాద్రపదం శూన్యమాసం కావడం సెప్టెంబరులో వివాహ ముహూర్తాలు లేవు. ఈనెల శ్రావణం శుభకరంగా భావించి పెద్ద ఎత్తున వివాహాలకు నవ జంటలు సిద్ధమవుతున్నాయి.



# మరో అడుగు ముందుకు

## కోటిపల్లి- నర్సాపురం రైల్వేలైన్‌పై చిగురిస్తున్న ఆశలు

మండపేట, ఆగస్టు 2: కోటిపల్లి-నర్సాపురం మధ్య నిర్మించే రైల్వే వంతెన పనులకు గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పడిన అడ్డంకులు తొలగిపోనున్నాయి. కేంద్ర, రాష్ట్రాల్లో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాలు వంతెన నిర్మాణం వేగవంతంగా చేపట్టేలా ముందుకు సాగుతున్నాయి. సుమారు 15 సంవత్సరాల కిందట కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైను పనులకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2120 కోట్ల అంచనాలతో ముందుకువచ్చాయి. సుమారు 57 కిలోమీటర్ల పొడవునా రైల్వేలైనుకు సంబంధించి జిల్లాలోని పాశర్లపూడి, చించినాడల మధ్య గోదావరి నదిపై వంతెనలు నిర్మించాల్సి ఉంది. రైల్వేలైన్ల కోసం భూసేకరణ 416.77 హెక్టార్ల మేర జరగాల్సి ఉంది. ఈ భూములు అమలాపురం, నర్సాపురం రెవెన్యూ డివిజన్‌ల పరిధిలో భూసేకరణ సేకరించాల్సి ఉంది. ఇప్పటికే 163.02 హెక్టార్ల మేర భూమి సేకరణ జరిగింది. ఆ భూముల్లో ఇప్పటికి కూడా రైతులు సాగు చేసుకుంటున్నారు. మిగిలిన భూములు సేకరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ఏర్పాటుపూర్తయితే ఉభయగోదావరి జిల్లాల తీరప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరనుంది. వాస్తవానికి దివంగత పార్లమెంట్ స్పీకర్ జీఎంసీ బాలయోగి తన ఆశయ సాధనగా కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణాన్ని చెబుతుండేవారు. ఈ రైల్వే నిర్మాణం బాలయోగి కృషితోనే బీజంపడింది. ఆయన మరణంతో పనులు ముందుకు సాగలేదు. ఇప్పటికే కాకినాడ నుంచి కోటిపల్లి వరకు రైల్వేలైను పూర్తయింది. దాంతోపాటు కోటిపల్లి-అమలాపురం మధ్య గోదావరి నదిపై పిల్లర్ల నిర్మాణం కూడా పూర్తయింది. మొత్తం రైల్వేలైన్‌కు రూ.2120 కోట్ల అంచనాకాగా, ఇప్పటివరకు 1118.19 కోట్లు వెచ్చించారు. 2024-25 సంవత్సరానికిగాను రైల్వేలైన్ పనులకోసం రూ.125 కోట్లను కేటాయించారు. ఇంకా 813.81 కోట్లమేర నిధులు విడుదల కావల్సి ఉంది. కోనసీమవాసుల చిరకాలవాంఛ రైల్వేలైను పూర్తయితే ఉభయ జిల్లాల మధ్య రైలు దూరభారం తగ్గడంతోపాటు పారిశ్రామిక అభివృద్ధి చెందే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని కోనసీమ ప్రాంత వాసులు చెబుతున్నారు.



కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి

## 'రైల్వేలైన్‌కు ఆమోదయోగ్యమైన ఎలైన్‌మెంట్'

అమలాపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించి ఎలైన్‌మెంట్ ప్రతిపాదనలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. రైల్వే, ఓఎన్జీసీ, గెయిల్, ఆర్‌అండ్‌బీ, జలవనరులశాఖ, ప్రజలు, ప్రజాప్రతినిధులు, జాతీయ రహదారుల అధికారులతో పూర్తిస్థాయిలో సంప్రదింపులు జరిపి అందరికీ ఆమోద యోగ్యమైన ఎలైన్‌మెంట్ ప్రతిపాదనను ఎంపిక చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర రవాణా, రహదారులు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతీలాల్ దండే అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తోపాటు జేసీ టి.నిషాంతి, ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ చినబాబు పాల్గొన్నారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ఎలైన్‌మెంట్ ప్రతిపాదనలపై కలెక్టర్‌తో ఆయన సమీక్షించారు. రైల్వేలైన్‌కు 57.21 కిలోమీటర్ల మేర రూ.21.20 కోట్లు మంజూరు అయ్యాయని, దీనిలో 75 శాతం కేంద్రం వాటా కాగా 25 శాతం రాష్ట్రవాటాగా నిర్ణయించారన్నారు. రైల్వేలైన్ కోసం ఇప్పటికే సేకరించిన భూములను నెల రోజుల వ్యవధిలో రైల్వేశాఖకు అప్పగించాలని కలెక్టర్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఎలైన్‌మెంట్ ప్రతిపాదనలు అన్నింటినీ క్రోడీకరించి అన్నివిధాలా ఆమోదకరమైన ఎలైన్‌మెంట్‌ను రెండు నెలల్లో రూపొందించి సమర్పిస్తామని తెలిపారు.

# ముంపు వీడి.. నష్టం తేలింది!



మానేపల్లి శివారు శివాయిలంకకు వరద ముంపు నేపథ్యంలో ట్రాక్టర్లో గ్రామస్తుల రాకపోకలు

## ముంపు నుంచి తేరుకుంటున్న లంక గ్రామాలు

### కొన్నిచోట్ల మాత్రం ఇంకా వరద కష్టాలే.. పాడి రైతులకు మరిన్ని ఇబ్బందులు

పి.గన్నవరం, ఆగస్టు 2: వరద ముంపు కారణంగా నీటమునిగిన పలు గ్రామాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. గోదావరి తగ్గుముఖం పట్టడంతో లంకగ్రామాల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. కానీ గ్రామాల్లోకి పూర్తిస్థాయిలో వరద రాకపోయినా లంకలను చుట్టుముట్టడంతో ఉద్యాన రైతులకు తీవ్రనష్టం వాటిల్లనుంది. అలాగే లంకల్లో పచ్చికబయళ్లు పూర్తిగా మునిగిపోవడంతో పాడి రైతులకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. అయితే మండలంలోని మానేపల్లి శివారు శివాయిలంక, వాడ్రేవుపల్లి శివారు చినకందాలపాలెం గ్రామాల రహదారులు ఇంకా వరద ముంపులోనే ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు ట్రాక్టర్ల సాయంతో రాకపోకలు సాగిస్తున్నారు. మానేపల్లి శివారు పల్లిపాలెంలో వరద తాకిడికి మల్లాడి నాంచారమ్మ తాటాకిల్లు పూర్తిగా నేలమట్టమైంది. అలాగే పలు ఇళ్లు వరద నీరు చేరడంతో మట్టిగోడలు పెచ్చులుగా ఊడిపోతున్నాయి. కాగా గంటిపెదపూడి, ఉడిమూడి శివారు నాలుగు లంకగ్రామాలతోపాటు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన లంక గ్రామాల ప్రజలు నాటు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. కనకాయలంక కాజ్‌వే ముంపు నుంచి ఇంకా తేరుకోలేదు.



మానేపల్లి శివారు శివాయిలంకకు తాగునీరును తీసుకువెళ్తున్న దృశ్యం



బడుగువానిలంకలో గోదావరి వరదలకు ముంపునకు గురైన బొప్పాయితోట.. (కింద) చెముడులంకలో ఎండిపోతున్న బొప్పాయితోట



# పంటలన్నీ నాశనం

- పంట భూముల్లో తగ్గుతున్న వరద.. ఇప్పుడిప్పుడే బయటపడుతున్న నష్టాలు
- ధ్వంసమైన పంటలను చూసి బోరున విలపిస్తున్న రైతులు.. అంతా సర్వనాశనం



మానేపల్లి శివారు పల్లిపాలెంలో ముంపు వల్ల నేలమట్టమైన తాటాకిల్లు

ఆలమూరు, ఆగస్టు 2: గోదావరి నీరు తగ్గుముఖం పట్టింది.. దీంతో పంట భూముల్లోని వరదనీరు క్రమంగా తగ్గుతుండడంతో పంటనష్టాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఆలమూరు మండలంలో బడుగువానిలంక, చెముడులంక, మడికి, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు ప్రాంతాల్లోని వేలాది ఎకరాల లంక భూముల్లో వాణిజ్యపంటలు సాగుచేస్తుంటారు. లంక భూములు సారవంతంగా ఉండి ఏరకమైన పంటలు వేసినా మంచి దిగుబడులు వస్తుంటాయి. ఈ గ్రామాల్లోని లంక భూముల్లో నిత్యం పచ్చటి పంటలతో కళకళాడుతుంటాయి. అయితే గోదావరి వరదలు వచ్చిన సమయంలో ఎంతో విలువైన వాణిజ్య పంటలు గోదావరి వరదనీటిలో మునిగి పూర్తిగా ధ్వంసం అవుతుంటాయి. సాదారణంగా గోదావరికి వరదలు ఆగస్టు, సెప్టెంబరు నెలలో వరదలు అధికంగా వస్తుంటాయి. దాంతో ఆగస్టు నాటికి సాధ్యమైనంత ఎక్కువగా పంటలు కోతకు వచ్చే విధంగా సాగుచేస్తుంటారు. అయితే ఈ ఏడాది జూలై నెలలోనే వరదలు వచ్చేయడంతో పంట నష్టం అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ముంపు నుంచి బయటపడుతున్న పంటలు ఒక్కసారిగా కుళ్లిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రైతులకు జరిగిన నష్టాలను గుర్తించి తక్షణ సాయం అందించాలని పలువురు కోరుతున్నారు. ఇక గోదావరి పరీవాహక ప్రాంత రైతులకు ఆగస్టు నెలకు ఎక్కడో ముడిపడి ఉంటుంది. ఈనెల వస్తుందంటేనే గోదావరి లంక భూముల రైతుల్లో గుబులు మొదలవుతుంది. గోదావరి లంక భూముల్లో సాగు చేస్తున్న రైతులు ఆగస్టు నెలలో వచ్చే వరదల వల్ల తీవ్రంగా నష్టపోవడం ఏటా జరుగుతుంటుంది. గత మూడు, నాలుగు దశాబ్దాలకాలంగా ప్రతీ ఏడాది ఆగస్టు నెలలో పూర్తిగానో, పాక్షికంగానో నష్టం జరుగుతోంది. ఈ ఏడాది ఆగస్టు రాకుండానే పంటలకు నష్టం జరిగింది. ఈ ఆగస్టులో ఇంకేంత నష్టం జరుగుతుందోనని రైతులు ఆందోళనలో ఉన్నారు.

## 10వ తేదీకి సమగ్ర పంట నష్టాల నివేదికను సిద్ధం చేయాలి : కలెక్టర్

అమలాపురం, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గోదావరి వరదలకు నష్టపోయిన వ్యవసాయ, ఉద్యాన పంటల సమగ్ర నివేదికను ఈనెల 10వ తేదీ నాటికి జిల్లా యంత్రాంగానికి సమర్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. ఈనెల 4వ తేదీలోగా పంట నష్టపరిహారాల అంచనా గణనను పూర్తిచేసి రైతు సేవా కేంద్రాల వద్ద సోషల్ ఆడిట్ నిమిత్తం ప్రదర్శించాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి మండలస్థాయి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. వరదల అనంతరం ముంపు ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఏటిగట్ల పటిష్టత, అవుట్‌ఫాల్ స్లూయిస్ గేట్ల మరమ్మతు పనులకు సంబంధించి అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ప్రస్తుతం వరద చివరి ప్రమాద హెచ్చరికను కూడా ఉపసంహరించుకోవడం జరిగిందన్నారు. ముంపు ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్య చర్యలను వేగవంతం చేయాలన్నారు. ముంపు బాధితుల ఆరోగ్య భద్రతకై చర్యలు చేపట్టి అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉద్యానపంటల సుమారు 14 మండలాల్లో ముంపు బారిన పడ్డాయని, 33 శాతం పైబడి పంట నష్టాలు సంభవించిన వాటిని పరిగణలోకి తీసుకునేలా మార్గదర్శకాలను విడుదల చేశారన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్



అల్లవరం మండలం ఓడలరేవు సముద్రతీరంలో అలలధాటికి కోత

## ముందుకొచ్చిన సముద్రం.. ఓడలరేవులో భారీగా భూమికోత

అల్లవరం, ఆగస్టు 2: వైనతేయ వరద నీరుతోడై బంగాళాఖాతంలో ప్రతికూల మార్పుల వల్ల రాకాసి అలలు ఉవ్వెత్తున ఎగిసి తీరభూమి భారీగా కోతకు గురైంది. సముద్రం నీరు ముందుకు చొచ్చుకురావడంతో పెనుముప్పు పొంచి ఉంది. అటవీశాఖ, రైతులకు చెందిన వందలాది ఎకరాలు తీర ప్రాంత భూమిని భారీగా సముద్రం కబళించిన తీర ప్రాంత రక్షణకై ఓఎన్జీసీ సంస్థలుగాని, ఇటు ప్రభుత్వాలుగాని పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గడిచిన ఇరవై ఐదేళ్లలో తీరం వెంబడి 800 మీటర్ల నుంచి కిలోమీటర్ల వెడల్పున తీర భూమిసముద్రగర్భంలో కలిసిపోయింది. తుఫాన్లు, వైపరీత్యాలు సంభవిస్తే అలల ఉధృతి పెరిగి భూమి కోతకు గురై సముద్రం ముందుకు వస్తోంది. కోట్ల రూపాయల చమురు సహజ ఉత్పత్తులు తరలించుకుపోతున్న ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలుగాని, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలుగాని తీర ప్రాంతరక్షణ చర్యలు చేయలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఓఎన్జీసీ టెర్మినల్ ప్లాంటు ప్రహరీపక్కన రోడ్డు కొట్టుకుని పోగా కొంత మేర జియోట్యూబ్ విధానంలో నల్లరాళ్లు వేసి వదిలేశారు. రాకాసి అలలు విరుచుపడుతున్నందున ఇటు ఓఎన్జీసీ ప్లాంటుకు, అటు ఓడలరేవు గ్రామానికి పెను ముప్పు పొంచి ఉంది. అమవాస్య దగ్గర కావడంతో అలల తీవ్రత పెరిగి భారీగా భూమి కోతకు గురవుతుంది. మరోపక్క గోదావరి వరదనీరు తీరాన్ని ముంచెత్తుతోంది. ఓడలరేవు, కొమరగిరిపట్నం, రామేశ్వరం సముద్రతీర ప్రాంతాల్లో ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధుల ద్వారా శ్వాశత రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులకు, కలెక్టర్‌కు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఓడలరేవు సమీపంలో జియో ట్యూబ్ రాళ్లు



## రావి ఆకుపై పింగళి వెంకయ్య



గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 2: లీఫ్ కార్వింగ్ కళ ద్వారా జాతీయ పతాకం రూపశిల్పి పింగళి వెంకయ్య చిత్రాన్ని రావి ఆకుపై చెక్కారు కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి నూకాలమ్మ గుడి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు. పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నల్ల బల్లలపై వెంకయ్య చిత్రాన్ని గీయడంతో పాటు రావి ఆకుపై చిత్రించిన ఆయన చిత్రాన్ని చూపి జీవిత చరిత్రను వివరించారు. గోవిందరాజులును ఎంఈవోలు నాయుడు వెంకటేశ్వరరావు, జి.శివప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

## అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దర్శనాలు ప్రారంభం



మామిడికుదురు, ఆగస్టు 2: వరదల నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లిలో కొన్ని రోజులుగా నిలిపివేసిన బాలబాలాజీ స్వామి దర్శనాలను శుక్రవారం పునఃప్రారంభించారు. భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు, ముడుపులు చెల్లించుకోవాలని సహాయ కమిషనరు జి.మాధవి కోరారు.

## నేడు జీఎస్ఎల్‌లో ఐఎంఏ కాన్ఫరెన్స్

రాజానగరం, ఆగస్టు 2: జనరల్ ప్రాక్టీషనర్ల సేవలను బలోపేతం చేసే దిశగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో శనివారం జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సోమనాథ్ దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 500 మంది జనరల్ మెడిసిన్ ఫిజీషియన్లు పాల్గొంటారని డైరెక్టర్ ఆఫ్ స్టడీస్ డాక్టర్ పీఎస్ శర్మ తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు కాన్ఫరెన్స్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి కందుల దుర్గేశ్ ప్రారంభిస్తారని ఐఎంఏ రాజమహేంద్రవరం ప్రెసిడెంట్ డాక్టర్ వై.గురుప్రసాద్, సెక్రటరీ డాక్టర్ విజయ భాస్కర్ తెలిపారు. ఐఎంఏ ఆంధ్రప్రదేశ్, రాజమండ్రి విభాగాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పేపర్ ప్రజెంటేషన్లు, చర్చాగోష్ఠులు, కీలకోపన్యాసాలు ఉంటాయన్నారు. ఐఎంఏ డీన్ డాక్టర్ సత్యజిత్ బోరా, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ వీఎస్ వీఎల్ నరసింహం, డాక్టర్ బీసీ రాయ్ తదితర ప్రముఖులు పాల్గొంటారని డాక్టర్ సోమనాథ్ దాస్ వివరించారు.

### ఆర్టీసీలో అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఐటీఐ ఉత్తీర్ణులైన వారి నుంచి ఆర్టీసీలో అప్రెంటీస్ కోసం దరఖాస్తులు కోరుతున్నామని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, మోటార్ మెకానిక్, వెల్డర్ ట్రేడ్‌లకు సంబంధించి ఈనెల 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్ (www.apprenticeshipindia.gov.in)లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు 10వ తరగతి, ఐటీఐ మార్కుల జాబితా, ఆధార్, బయోడేటా, తపాలా చిరునామా, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలవారు కుల ధ్రువీకరణపత్రం జతచేయాల్సి ఉందన్నారు. వచ్చిన దరఖాస్తులకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన ఆగస్టు 27న విజయనగరంలోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో జరుగుతుందని పేర్కొన్నారు.





## నీలి నీలి ఆకాశం

కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో శుక్రవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం నీలి రంగులోకి మారి ప్రజలను కనువిందు చేసింది. ఈ దృశ్యాలు 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కాయి.

కాకినాడ ఇంద్రపాలెంలో...

రాజమహేంద్రవరం నాలుగో బ్రిడ్జి వద్ద...

# గోదావరి తగ్గినది

- సాధారణ స్థాయికి ప్రవాహం
- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

ధవళేశ్వరం, ఆగస్టు 2: గత రెండు వారాలుగా ఉరకలేసి ఉధృతంగా ప్రవహించిన గోదావరి క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంటోంది. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటలకు నీటిమట్టం 11.70 అడుగులకు తగ్గి 9.86లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది. దీంతో 11 రోజులుగా కొనసాగిన మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఆపై నీటిమట్టం రాత్రి 7గంటలకు 10.50అడుగులకు తగ్గింది. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి 8,37,740 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో అన్నిచోట్లా నీటిమట్టం తగ్గుముఖం పట్టి సాధారణ స్థాయికి చేరుకుంటున్నాయి. భద్రాచలం వద్ద శుక్రవారం రాత్రి 7గంటలకు నీటి మట్టం 34.10 అడుగులుగా నమోదైంది.

**1,481 టీఎంసీలు సముద్రం పాలు**

వరదల సీజను మొదలై ఇప్పటివరకు అంటే జూన్ నెల నుం చి శుక్రవారం వరకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 1481.79 టీఎంసీల వరద నీరు సముద్రంలోకి ప్రవహించింది. ఏప్రిల్‌లో గోదావరిలో లభించిన నీరు కేవలం 2టీఎంసీలు మాత్రమే. గోదావరికి వరద ప్రవాహం వచ్చి ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ద్వారా 10లక్షల క్యూసెక్కులు ప్రవహించడంతో జూలై 22న మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. ప్రవాహం మరింత పెరగడంతో 23న రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆపై వరద ప్రవాహం తగ్గడంతో 25న రెండో ప్రమాదహెచ్చరికను ఉపసంహరించగా నీటిమట్టం 13.75 అడుగులకు పెరగడంతో 27న రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. నీటిమట్టం క్రమంగా పెరుగుతూ 15.80 అడుగులకు చేరుకోగా 16లక్షల క్యూసెక్కులు పైగా సముద్రంలోకి ప్రవహించింది. నీటిమట్టం తగ్గడంతో 30న రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఆపై గోదావరి తగ్గుతూ, పెరుగుతూ, నిలకడగా కొనసాగడంతో మూడు రోజుల పాటు మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగింది. ఎట్టకేలకు శుక్రవారం తెల్లవారుజామున నీటిమట్టం 11.70 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. 11రోజుల వ్యవధిలో 1207 టీఎంసీల వరద నీటిని సముద్రం లోకి వదిలారు. ఈ నీటితో మూడు డెల్టాల పరిధిలో ఏటా రెండు పంటలకు 10లక్షల ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందించవచ్చు.



కాటన్ బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

### పోశమ్మగండి వద్ద తగ్గిన ఉధృతి

దేవీపట్నం, ఆగస్టు 2: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు నదులు పొంగి ప్రవహించి గోదావరిలో కలిసాయి. దీంతో మండలంలోని గోదావరి పరీవాహక ప్రాంతాలు నీట మునిగాయి. రెండు రోజులుగా వరద తగ్గుముఖం పట్టింది. దీంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం శుక్రవారం వరద నీటి నుంచి బయటపడింది. గోదావరి వరద ఉధృతి తగ్గుతుండడంతో పలు వాగులు నిలకడగా ప్రవహిస్తున్నాయి.



## దుర్గాడ శివాలయంలో వైభవంగా శత రుద్రయాగం

### రామలింగేశ్వర స్వామికి శాకంబరీ అలంకారం





గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 2: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో వేంచేసియున్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి శుక్రవారం శతరుద్రయాగం వైభవంగా జరిగింది. మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో స్వామికి శాకంబరీ అలంకారం చేశారు. గీతా వెంకటేశ్వర స్మార్త యాజుష ఆగమ పాఠశాల స్మార్త విద్యార్థులతో ఘంటసాల సోమేశ్వరశర్మ బ్రహ్మత్వంలో మహాగణపతి, పుణ్యాహవచనం, మండపారాధన, సూర్యనమస్కారాలు, శాంతి కల్యాణం, మహారుద్ర హోమం, సౌర హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు స్వామికి సప్త హారతులు ఇచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సేవా సమితి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఏలూరు రేంజ్ పరిధిలో సీఐలకు స్థానచలనం

ఏలూరు క్రైం, ఆగస్టు 2: ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్న సీఐలలో 41 మందిని బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ జిల్లా, డాక్టరు బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలో పని చేస్తున్న 41 మందికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే వివిధ కారణాల వల్ల ఇద్దరు సీఐల బదిలీలు నిలిపివేసినట్లు సమాచారం. పోలవరం సీఐగా పనిచేస్తున్న మధుబాబు, గన్నవరం ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న పెద్దిరాజుల బదిలీలను నిలిపివేస్తూ ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. అలాగే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అతి చేసిన కొందరిని ప్రభుత్వం వీఆర్‌కు పంపింది.

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ అయిన స్థానం |
|---|---|---|
| ఆర్.అంకబాబు | వీఆర్ కాకినాడ | సామర్లకోట యూపీఎస్ |
| డి.సురేష్ | సామర్లకోట యూపీఎస్ | (వీఆర్)ఏలూరు రేంజ్ |
| టి.క్రాంతికుమార్ | జీలుగుమిల్లి సర్కిల్ | పెద్దాపురం సర్కిల్ |
| వై.రవికుమార్ | పెద్దాపురం సర్కిల్ | (వీఆర్) ఏలూరు రేంజ్ |
| జి.చెన్నకేశవరావు | వీఆర్ ఏలూరు రేంజ్ | తుని రూరల్ సర్కిల్ |
| ఎస్‌వీవీఎస్ మూర్తి | తుని రూరల్ సర్కిల్ | వీఆర్, ఏలూరు రేంజ్ |
| ఎం.మోహన్‌కుమార్ | వీఆర్ ఏలూరు రేంజ్ | ముమ్మిడివరం సర్కిల్ |
| ఎన్.కొండయ్య | ముమ్మిడివరం సర్కిల్ | తణుకు టౌన్ పీఎస్ |
| సీహెచ్ విద్యాసాగర్ | ఇనగుదురు(కృష్ణా) | రావులపాలెం సర్కిల్ |
| ఎం.రాంకుమార్ | రావులపాలెం సర్కిల్ | (వీఆర్) ఏలూరు రేంజ్ |
| పి.విశ్వం | దిశా పోలీస్‌స్టేషన్ ఏలూరు | కొవ్వూరు టౌన్ యూపీఎస్ |
| వి.జగదీశ్వరరావు | కొవ్వూరు టౌన్ యూపీఎస్ | ఆకివీడు సర్కిల్ |
| కె.రజనీకుమార్ | సీసీఎస్-2 తూర్పుగోదావరి | పాలకొల్లు టౌన్ యూపీఎస్ |
| కె.మంగాదేవి | పాలకొల్లు టౌన్ యూపీఎస్ | అలాట్ టు తూర్పుగోదావరి |
| బి.ఎస్.చైతన్యకృష్ణ | కాకినాడ ట్రాఫిక్- 2 పీఎస్ | కాకినాడ రూరల్ సర్కిల్ |
| ఎ.శ్రీనివాస్ | కాకినాడ రూరల్ సర్కిల్ | (వీఆర్) ఏలూరు రేంజ్ |
| బొక్కా పెద్దిరాజు | వీఆర్, ఏలూరు రేంజ్ | సర్పవరం పీఎస్ |
| వై.ఆర్.కె.శ్రీనివాస్ | సర్పవరం పీఎస్ | (వీఆర్) ఏలూరు రేంజ్ |
| జి.మధుబాబు | పోలవరం సర్కిల్ | రాజమహేంద్రవరం త్రీటౌన్ |
| వీరయ్యగౌడ్ | రాజమహేంద్రవరం త్రీటౌన్ | (వీఆర్) ఏలూరు రేంజ్ |
| కె.విజయబాబు | టీసీఎస్-1 రాజమహేంద్రవరం | కొవ్వూరు రూరల్ సర్కిల్ |
| పి.శ్రీనివాసరావు | కొవ్వూరు రూరల్ సర్కిల్ | (వీఆర్)ఏలూరు రేంజ్ |

## ధృక్ సిద్ధాంత ప్రామాణికంగా నిర్దేశించి పండుగలను గుర్తించాలి

### బ్రాహ్మణ పంచాంగకర్తల సంఘం డిమాండ్

సర్పవరం జంక్షన్, ఆగస్టు 2: ధృక్ సిద్ధాంత ప్రామాణికంగా నిర్దేశించిన పండుగలను మాత్రమే ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోవాలని తెలుగు రాష్ట్రాల ధృక్ సిద్ధాంత పంచాంగకర్తల సమాఖ్య డిమాండ్ చేసింది. శుక్రవారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట శివారు రాయుడుపాలెంలోని బ్రాహ్మణ భవనలో సంఘ కార్యదర్శి పొన్నలూరి శ్రీనివాస గార్గేయ అధ్యక్షతన పంచాంగకర్తలతో సదస్సు నిర్వహించారు. గార్గేయ సిద్ధాంతి, గొర్తి పట్టాభిశాస్త్రి, తెలంగాణ పంచాంగకర్తల అధ్యక్షుడు అవసరాల ప్రకాశ్‌శర్మ మాట్లాడుతూ... పూర్వ పద్ధతి గణన ముమ్మాటికీ తప్పేనని, దీనివల్ల పండుగ నిర్ణయాలపై ప్రజల్లో అయోమయం, గందరగోళం నెలకొందన్నారు. ధృక్ గణిత పంచాంగం ఆధారంగా పండుగలు నిర్ణయించి ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. టీటీడీ తమిళ పంచాంగాన్ని ధృక్ సిద్ధాంతం ఆధారంగా ప్రచురిస్తున్నారని, తెలుగు పంచాంగాన్ని మాత్రం పూర్వ పద్ధతిలో నిర్ణయించడంతో అపోహలు వీడట్లేదన్నారు. ఒక్క శృంగేరి పీఠం తప్ప, కంచి కామకోటి పీఠంతో సహా దేశంలోని అన్ని పీఠాలు ధృక్ సిద్ధాంతాన్ని ఆమోదించాయన్నారు. సమావేశానికి హాజరైన 36 మంది పంచాంగకర్తలు పలు ... ఆదిత్య, నాగార్జున ఆదిత్య, నిట్టల వెంకటశివరామకృష్ణ, ఎక్కిరాల రామకృష్ణ, పి.రవి శంకర్, పి.చంద్రశేఖర్, నిర్మలానంద స్వామి, కారుపర్తి నాగేమల్లేశ్వర సిద్ధాంతి, దేవరభొట్ల భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పంచాంగకర్తల ప్రతినిధులు



సతీష్‌కు నియామక పత్రం అందజేస్తున్న జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్రహ్మణ్య శర్మ

## పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా గుర్తించాలి

### రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు జోస్యుల సుబ్రహ్మణ్య శర్మ

కడియం, ఆగస్టు 2: పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా ప్రభుత్వం గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సమాఖ్య కోరింది. తూర్పు గోదావరి జిల్లా వేమగిరిలోని పార్వతీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సమాఖ్య మొదటి సమావేశం జిల్లా గౌరవాధ్యక్షుడు జోస్యుల సుబ్రహ్మణ్యశర్మ అధ్యక్షతన జరిగింది. తొలుత సంఘం యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా నియమితుడైన కొత్తూరి సతీష్‌తో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ ఆలయాల్లో పౌరోహిత్యం చేసే పురోహితులను ప్రభుత్వం గుర్తించి, వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన వేదపండితులు, పురోహితులకు పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. అర్చకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అందుకు ఓ కమిషన్ వేయాలన్నారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని ఆలయాల కమిటీల్లో పురోహితులకు సభ్యుడిగా స్థానం కల్పించాలన్నారు. బ్రాహ్మణులు అపరకర్మలు నిర్వహించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఓ భవనం నిర్మించాలన్నారు. వేద విద్యను అభ్యసించే నిరుద్యోగులకు యువగళం పథకంలో రూ.3 వేలు భృతి ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మర్ల సీతారామశాస్త్రి, గోవిందవఝుల సుబ్రహ్మణ్యశర్మ, కొత్తూరి సతీష్, ఎ.సురేంద్రబాబు, కడియం గాయత్రీ బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు వేదాంతం నాని, పున్నమిరాజు వీర్రాజు, ఎస్‌వీఎల్ నరసింహారావు, కేవీ సుబ్బారావు, పాలగుమ్మి శేషగిరిరావు, బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో వైద్య సేవల నిర్లక్ష్యంపై సీఎంకు ఫిర్యాదు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2: రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో అత్యవసర వైద్య సేవలు అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపించినవైద్యురాలు, ఇతర వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రిలకు ఫిర్యాదు చేసినట్టు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెంటూరుకు చెందిన ఖండవల్లి భరత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెల 31న భరత్‌కుమార్ తన కుమారుడు లీలా శ్రీకర్‌తో కలసి రాజమహేంద్రవరం సమీపంలోని డాక్టర్ అంబేద్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీకి స్పాట్ అడ్మిషన్లకు వస్తుండగా రాజవోలు దాటిన తర్వాత వారి వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో లీలా శ్రీకర్‌కు కుడిచెయ్యి విరిగింది. గాయాలతోనే కాలేజీకి చేరుకుని స్పాట్ అడ్మిషన్ పూర్తిచేసుకున్న తర్వాత చికిత్స కోసం మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు వెళ్లారు. ఎమర్జెన్సీ ఓపీ తీసుకుని ఆ సమయంలో డ్యూటీలో ఉన్న వైద్యురాలి వద్దకు వెళితే చాలాసేపు బయటే నిలిపివేసి వైద్య సేవలు అందించడంతో నిర్లక్ష్యం చూపారన్నారు. తన కుమారునికి చెయ్యి విరిగిందని అనుమానంగా ఉందని ఎక్స్‌రే రాయాలని కోరితే చీటీ రాసిచ్చారని, ఎక్స్‌రే తీసిన తర్వాత ఆర్థోపెడిక్ డాక్టర్ గది వద్దకు వెళితే అక్కడ ఎవరూ లేరని భరత్‌కుమార్ ఆరోపించారు. దీంతో తనకు భయం వేసి రాజమహేంద్రవరం నుంచి కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చూపిన వారిపై చర్యలు తీసుకోవాలని భరత్‌కుమార్ కోరారు.

### పాముకాటుతో కౌలు రైతు మృతి

పిఠాపురం రూరల్, ఆగస్టు 2: పాముకాటుకు గురయి కౌలురైతు మరణించిన సంఘటన కాకినాడ జిల్లా పిఠాపురం మండలం గోకివాడలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కౌలు రైతు కొమ్ము నాగేశ్వరరావు(58) పొలం పనులకు వెళ్లి గడ్డి కోస్తున్నాడు. అక్కడ పాము కాటుకు గురయ్యాడు. ఇంటికి వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ జిల్లా కమిటీ మాజీ సభ్యుడు కొమ్ము చినబాబుకు సోదరుడు.



నాటుసారాను ధ్వంసం చేస్తున్న పోలీసులు, ఎస్ఈబీ అధికారులు

## రూ.14.50 లక్షలు విలువైన నాటుసారా, మద్యం సీసాలు ధ్వంసం

పెద్దాపురం, ఆగస్టు 2: కాకినాడ జిల్లా పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన నాటుసారా, మద్యం సీసాలను పోలీసు, ఎస్ఈబీ అధికారులు శుక్రవారం ధ్వంసం చేశారు. స్థానిక పోలీస్ క్వార్టర్ వద్ద ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ దొర, డీఎస్పీ కె.లతాకుమారి ఆధ్వర్యంలో 287 కేసుల్లో పట్టుబడిన రూ.14,50,947 విలువైన నాటుసారా, మద్యం సీసాలను ధ్వంసం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు. నాటుసారా తయారీ కేంద్రాల వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని, సారా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం మోపుతున్నట్టు పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సామర్లకోట, జగ్గంపేట సీఐలు అంకబాబు, లక్ష్మణరావు, ఎస్ఐలు వెలుగుల సురేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 5న కాకినాడలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, ఆగస్టు 2: వికాస ఆధ్వర్యంలో ఈ నెల 5న కాకినాడలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కెలచ్చారావు తెలిపారు. ఎస్‌డీవీవీఎల్ సర్వే అండ్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేటు లిమిటెడ్‌లో సర్వే ఇంజనీర్, డిజైనింగ్ ఇంజనీర్ అండ్ సైట్ ఇంజనీర్, శ్రీరామ్ కాంటాక్ట్ సెం టర్లో కస్టమర్ రిలేషన్ ఆఫీసర్, టెలికాలింగ్ ఎగ్జిక్యూటివ్ అండ్ డేటా సోర్స్ ఎగ్జిక్యూటివ్ డిక్సాన్, హోండాయ్ మోబిస్ అండ్ రాక్‌మెన్ ఇండస్ట్రీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు .12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటాయి. ఆసక్తి గల వారుసోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76111 ను సంప్రదించాలన్నారు.



## మోటారు సైకిలును ఢీకొన్న కారు

### ముగ్గురికి తీవ్ర గాయాలు



గోకవరం, ఆగస్టు 2: తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం వెంకటాపురం గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం... దేవీపట్నం మండలం ఇందుకూరుపేట నుంచి తుర్రం సురేష్, అతని భార్య భవాని, కుమారుడు హేమంత్ కుమార్‌దొర మోటార్ సైకిలుపై రంపచోడవరం మండలం కె.ఎర్రంపాలెం (అత్తగారుఇంటికి) బయల్దేరారు. మండలంలోని వెంకటాపురం వెళ్లేసరికి రంపచోడవరం వైపు నుంచి గోకవరం వైపు వస్తున్న కారు వీరి మోటారు సైకిలును బలంగా ఢీకొంది. ఈ ఘటనలో సురేష్, భవాని, కుమార్‌దొర తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైసీపీ కార్యాలయం కూల్చివేతకు..

### రాజమహేంద్రవరం కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు రద్దు

అమరావతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని వైసీపీ కార్యాలయం కూల్చివేతకు మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన తుది ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. పార్టీ కార్యాలయ నిర్మాణానికి తీసుకున్న అనుమతులు, బిల్డింగ్ ప్లాన్ వివరాలను జతచేస్తూ భవన నిర్మాణ అనుమతి రెన్యువల్ కోసం అధికారులకు తాజాగా దరఖాస్తు చేసుకోవాలని పిటిషనర్లకు సూచించింది. అనుమతులు లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయాల విషయంలో జూలై 4న ఈ కోర్టు ఇచ్చిన ఆదేశాలకు, చట్టనిబంధనలకు లోబడి ఆ దరఖాస్తుపై నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ప్రత్యక్షంగా హాజరై వాదనలు వినిపించేందుకు పిటిషనర్లకు అవకాశం ఇవ్వాలని పేర్కొంది. కోర్టు ఉత్తర్వులు అందిన తర్వాత రెండు నెలల్లో దరఖాస్తు పరిష్కరించాలని స్పష్టం చేసింది. భవన నిర్మాణ అనుమతుల రెన్యువల్ కోసం ప్రత్యక్షంగా దరఖాస్తు సమర్పించేందుకు పిటిషనర్లకు వెసులుబాటు ఇచ్చింది. దానిపై తుది నిర్ణయం వెల్లడించేంతవరకు వైసీపీ కార్యాలయ భవనం విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశించింది. నిర్మాణాలు కొనసాగించవద్దని పిటిషనర్లకు తేల్చిచెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### ఎస్సీ వర్గీకరణపై మాలల నిరసన

అల్లవరం, ఆగస్టు2: ఎస్సీవర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని తాడికోనలోని మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత పీవీ రావు విగ్రహం శుక్రవారం వద్ద నిరసన తెలిపారు. వర్గీకరణ పేరుతో ఎన్డీఏ ప్రభుత్వం దళితులని విడకొట్టి కుట్ర చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో దాసరి బాలస్వామి, సబ్బతి సత్తిరాజు, బడుగు నాగార్జున, దాసరి దానయ్య, గుమ్మళ్ల చరణ్, ఉండ్రు పేరయ్య, దాసరి వరప్రసాద్, డి.వెంకటేష్, బడుగు చిన్న, ఏ.నాగరాజు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శాకంబరిగా అమ్మవార్ల దర్శనం




అమలాపురం: ఇందుపల్లి శ్రీమావుళ్లమ్మతల్లి
పి.గన్నవరం: శాకంబరిగా ముంగండ ముత్యాలమ్మ

అమలాపురం రూరల్, ఆగస్టు 2: బండారులంక బిళ్లవారి వీధిలో శ్రీపద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామివారిని శుక్రవారం శాకంబరి, శాకంబరుని అలంకారం చేశారు. శ్రీశ్రీనివాసా బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించిన స్వామి-అమ్మవార్లను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. శ్రీపాండురంగ విఠల భజన మండలి, శ్రీనివాసా అన్నదాన మహిళా సేవాసమితి ఆధ్వర్యంలో అమ్మవార్లకు సారెను సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు, వివిధ రకాల మిఠాయిలు, నూతన వస్త్రాలతో గోవిందనామ స్మరణలు చేస్తూ సంప్రదాయబద్ధంగా పురవీధుల్లో ఊరేగుతూ ఆలయ సన్నిధికి చేరుకుని సారెను సమర్పించారు. సమయమంతులభాగ్యలక్ష్మిరత్నం, చింతపట్ల సీతారత్నం, బట్టు లక్ష్మి, ఓబులశెట్టి శారదాదేవి, నాళం కుమారి, కంచర్ల సత్యతో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఇందుపల్లి గ్రామదేవత శ్రీమావుళ్లమ్మ తల్లిని శాకంబరిగా విశేష అలంకారం చేశారు.

### శాకంబరిగా ముత్యాలమ్మ

పి.గన్నవరం, ఆగస్టు2: ముంగండ గ్రామదేవత శ్రీముత్యాలమ్మ అమ్మవారు శుక్రవారం శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు 31రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, కోటేశ్వరావు, మాజీ సర్పంచ్‌లు నేలపూడి దుర్గా రావు, చిట్టి కుమారి, ఉపసర్పంచ్ పెచ్చెట్టి వెర్రియ్య, అప్పారి సాయి, జల్లూరి గుప్త, గ్రామీణ వైద్యులు బుజ్జి పాల్గొన్నారు.

### ఘనంగా సత్తెమ్మతల్లి సంబరం

అంతర్వేది, ఆగస్టు 2: అంతర్వేది తీర ప్రాంతంలో ఆషాఢమాసం సందర్భంగా సత్తెమ్మతల్లి అమ్మవారి సంబరాలను వైభవంగా నిర్వహించారు. మంగళ, శుక్రవారాల్లో జరిగే సంబరాల్లో ఆషాఢ మాసం చివరి శుక్రవారం కావడంతో అంతర్వేది దిండకొడప వద్ద కోటసత్తెమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామ ఆడపడుచులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. గణాసరి చెన్నంశెట్టి శ్రీను ఆధ్వర్యంలో అమ్మవారికి మొక్కులు, కానుకలను భక్తులు సమర్పించారు.

### శాకంబరిగా దుర్గమ్మ

అంబాజీపేట, ఆగస్టు 2: అంబాజీపేట వీరభద్ర థియేటర్ సమీపంలో ఉన్న శ్రీవిజయకనకదుర్గమ్మ అమ్మవార్ని ఆషాఢ మాసం సందర్భంగా వివిధ రకాల కూరగాయలతో ఆలయ అర్చకులు గుదూరు వీరభద్రరావు సుందరంగా అలకరించారు. అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

### నూకాలమ్మకు సారె సమర్పణ



యానాం, ఆగస్టు2: కాజులూరు మండలం పిల్లంక గ్రామదేవతలైనా నూకాలమ్మ, రావులమ్మ అమ్మావార్లకు కాళ్ల వారి పుట్టింటి వారు సారెను శుక్రవారం సమర్పించారు. యానాం ప్రాంతానికి చెందిన కాళ్ల ప్రసాద్, రామకృష్ణ కుటుంబ సభ్యులు ప్రతి ఏడాది సారెను యానాం నుంచి పంపుతారు. శుక్రవారం మేళతాళాలతో ఊరేగింపుగా వివిధ రకాల వంటలు, స్వీట్లు, పండ్లను వారు పిల్లంక తీసుకువెళ్లి ఆమ్మవారికి సమర్పించి ప్రతేక పూజలు నిర్వహించారు.

### ఎస్సీ వర్గీకరణపై హర్షం

మండపేట, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణ కోసం మందా కృష్ణ చేసిన పోరాటం ఫలించిందని, సుప్రీం కోర్టుతీర్పుపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకుడు దూళి జయరాజు మాదిగ ఆధ్వర్యంలో మాదిగలు ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. నాయకులు డి.రాజబాబు, గాలింకి నాగేశ్వరరావు, చాపల వీరబాబు, పెందుర్తి కిషోర్, దూళి ప్రవీణ్, మచ్చా రాంబాబు, తాతపూడి అశీర్వాదం పాల్గొన్నారు.

### ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కారం

రామచంద్రపురం(ద్రాక్షారామ),జూలై2: వార్డుల్లో సమస్యలు పాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం కృతజ్ఞతా పర్యటనలో భాగంగా రామచంద్రపురం 3,4వ వార్డుల్లో మంత్రి పర్యటించారు. వార్డుల్లో ప్రధాన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలను నుంచి సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కౌన్సిలరు అంకం శ్రీనివాస్, మాజీ కౌన్సిలరు అల్లం శ్రీనివాస్, బీజేపీ నాయకుడు సలాది సతీష్‌నాయుడు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, నాయకులు గుణ్ణం వినోద్‌కుమార్, బీజేపీ నాయకుడు కొట్టువాడ హరిబాబు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### దళిత చైతన్యవేదిక సేవలు అభినందనీయం

రాజోలు, ఆగస్టు 2: దళిత చైతన్యవేదిక విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయమని చింతలపల్లి సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి కొనియాడారు. దళిత చైతన్యవేదిక ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పేబ్యాక్ టూద సొసైటీ ప్రోగ్రాం చింతలపల్లి హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు డి.జానకిరామయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. అనంతరం 150మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, మట్ట సురేష్, విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, బత్తుల జనార్థనరావు, పీఈటీ చొప్పల చంద్రశేఖర్, చుట్టుగుళ్ల సత్యనారాయణ, తెన్నేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రుద్రాభిషేకం

ఆత్రేయపురం, ఆగస్టు 2: వాడపల్లి శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవార్కి కుంకమార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో శిష్టా సూర్యకుటుంబరావు, పి.బాబురావు, ఎం.రాము, బులుసు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంటీఎస్ ఆత్మీయ సమావేశానికి తరలిరావాలి

అంబాజీపేట, ఆగస్టు 2: విజయవాడ హనుమాన్‌పేట దాసరి భవన్‌లో ఈనెల4న జరిగే ఏపీ డీఎస్సీ 1998ఎంటీఎస్ ఉపాధ్యాయ ఆత్మీయ సమావేశానికి తరలిరావాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఎంటీఆర్ టీచర్స్ సంఘం అధ్యక్షుడు చొల్లంగి కేశవకుమార్ పిలుపునిచ్చారు. సమస్యలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. సమావేశంలో పలు అంశాలను చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని కేశవకుమార్ తెలిపారు.

### నష్టపరిహారం అందిస్తాం

అంతర్వేది, ఆగస్టు 2: రాజోలు నియోజకవర్గ పరిధిలో లంక గ్రామాల్లో వరద ముంపునకు గురైన 4,528 బాధిత కుటుంబాలకు రూ.3వేలు నష్టపరిహారం అందిస్తామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు నియోజకవర్గ వరద బాధితుల సమస్యలు వివరించినట్టు తెలిపారు. వరద ప్రాంతాల్లో పారిశుధ్యం పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్టు ఆయన తెలిపారు.

### ఓడలరేవు తీరంలో వృద్ధుడి మృతదేహం

అల్లవరం/అంబాజీపేట, ఆగస్టు 2:ఓడలరేవు సముద్ర తీరానికి ఓ వృద్ధుడి మృతదేహం కొట్టుకువచ్చింది. అంబాజీపేట మండలం వాకలగరువుకు చెందిన పేరాబత్తుల చంద్రరావు(65) గురువారం పొలం పనుల కోసం వెళ్లాడు. చంద్రరావు ప్రమాదవశాత్తు వరద నీటిలో కొట్టుకుపోయ్యాడు. మృతదేహన్ని ఓడలరేవు సముద్రం ఒడ్డున లభ్యమైందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరీష్‌కుమార్ తెలిపారు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు.

### శాంతి ర్యాలీ

అమలాపురం టౌన్, ఆగస్టు 2: కేరళతో సహా వివిధ రాష్ట్రాల్లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలుపుతూ అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోనం సత్తిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ ముఖ్య అతిథిగా హాజరై కేరళ, హిమాచల్‌ప్రదేశ్, కేథార్‌నాథ్ తదితర ప్రాంతాల్లో వందలాది మంది వరదల భీభత్సానికి ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఆత్మశాంతి కలగాలని కోరుతూ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ డాక్టర్ రాఘవేంద్రరావు, డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, మోకా వెంకటసుబ్బారావు, కొమ్మూరి వెంకటాచలప్రసాద్, పెనుమాల చిట్టిబాబు, వాసంశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభ్యున్నతికి కృషి: ఎమ్మెల్యే కొండబాబు



మత్స్యకారుల సంఘం ప్రమాణ స్వీకారంలో వనమాడి

మండపేట, ఆగస్టు 2: మత్స్యకారుల సంక్షేమాన్ని గతంలో వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వేంకటేశ్వరరావు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు. పట్టణంలోని సూర్యచంద్ర ఫిషర్‌మెన్ కల్యాణ మండపంలో జరిగిన నెయ్యలకుల మత్స్యకార రాష్ట్ర సంక్షేమ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే వనమాడి, మండపేట మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి వారు మత్స్యకారులతో కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ స్థానికంగా ఉండే చెరువుల్లో చేపలు పెంచుకోవటం, పట్టుకునే హక్కును టీడీపీ ప్రభుత్వం కల్పిస్తే వైసీపీ ప్రభుత్వం 217జీవో ద్వారా చెరువులను దక్కకుండాచేసి మత్స్యకారుల పొట్టకొట్టిందన్నారు. 217జీవోను కూటమి ప్రభుత్వం రద్దుచేసి మత్స్యకారులకు తిరిగి పునఃరజీవనం పోసిన ఘనత సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లదేనని రాష్ట్ర నెయ్యల కుల సంఘ అధ్యక్షుడు కాటా గోపి అన్నారు. నేతలు ఇద్దరికి సంఘం తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. వనమాడి, శ్రీప్రకాష్‌ను సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం నూతన కార్యవనర్గాన్ని నేతలు అభినందించారు. కార్యక్రమంలో నెయ్యలకుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కాటా గోపి, కార్యదర్శి మండాది గిరి, ఉత్తరాంధ్ర గౌరవ అధ్యక్షుడు సోమశేఖర్, కోస్తాంధ్ర నెయ్యలకుల సంఘ గౌరవ అధ్యక్షుడు విష్ణుమూర్తి పాల్గొన్నారు.

## నదీకోత నివారణకు రక్షణ చర్యలు: ఎమ్మెల్యే దాట్ల



కోతకు గురవుతున్న లంక భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ముమ్మిడివరం, ఆగస్టు 2: వివేకానంద వారధి, కూనాలంక, లంకాఫ్ ఠాణేలంక, సలాదివారిపాలెం గ్రామాల్లో నదీ కోతకు గురవుతున్న ప్రాంతాలను శుక్రవారం అధికారులతో కలిసి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పరిశీలించారు. రక్షణ చర్యలకు సంబంధించి గ్రోయిన్స్, రివిట్‌మెంట్ వంటి అంచనాలకు రూపొందించాలని జనవనరుల శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు గుత్తుల సాయి, తాడి నరసింహారావు, చెల్లి అశోక్, గోదశి పుండరీష్, అర్థాని శ్రీనివాసరావు, యాళ్ల ఉదయ్, పళ్ల రాజబాబు, గోదశి గణేష్, కురసాల శివ, జలవనరులశాఖ అధికారులు పాల్గొన్నారు.

### కళాశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తా

ముమ్మిడివరంలోని డాక్టర్ మోకా గణపతిరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలను అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పుస్తకాల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూనియర్ కళాశాలకు అవసరమైన వసతులన్నీ సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, సలాది బుచ్చినారాయణ, అర్థాని శ్రీనివాస్, అడబాల సతీష్ కుమార్, కట్టా సత్తిబాబు, దివి మహాలక్ష్మి, పిల్లి నాగరాజు, లోకినీడి వెంకటేశ్వరరావు, విళ్ల వీరాస్వామినాయుడు, తాడి జానకీరామ్, గొల్లపల్లి గోపి, చిక్కాల అంజిబాబు, మిమ్మితి చిరంజీవి, యాళ్ల ఉదయ్, దాట్ల బాబు, గోదశి గణేష్, జనిపల్లి సత్యనారాయణ, మెండి కమల, వాసంశెట్టి అమ్మాజీ, బొక్కా రుక్మిణి, కుడుపూడి మల్లీశ్వరి, దివి విజయ్ పాల్గొన్నారు.

## పాత పద్ధతిలోనే ప్రాథమిక పాఠశాలలు కొనసాగించాలి



ఉప విద్యాశాఖాధికారి సూర్యప్రకాశంకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అమలాపురం రూరల్, ఆగస్టు 2: గతంలో మాదిరిగా 1 నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలల విధానాన్ని కొనసాగించడంతో పాటు జీవో నంబరు 117ను తక్షణం రద్దు చేయాలని కోరుతూయూటీఎఫ్ నాయకుల బృందం ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశంకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విభాగం, ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, పాఠశాలల్లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని, స్థానికతకు తగినట్టుగా మధ్యాహ్నం భోజన పథకం మెను అమలు చేయాలని కోరారు. పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో యూటీఎఫ్ రాష్ట్రకౌన్సిలర్ మేరీరూతు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీఎస్ చంద్రరావు, కేవీఎన్ గౌడ్, కె.కిశోర్‌కుమార్, ఎం.రవికుమార్, ఎస్.వెంకటేశ్వరరావు, పి.గణేష్‌కుమార్, జె.గౌతమ్, సత్యవాణి పాల్గొన్నారు.

### జీతాల చెల్లింపుపై ఉపాధ్యాయుల హర్షం

మండపేట, ఆగస్టు 2: 1న జీతాలు చెల్లించడంపై 1998 డీఎస్సీ టీచర్ల అసోసియేషన్, ఎంటీఎస్ ఉపాధ్యాయులు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో శుక్రవారం డిమాండ్లు పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయులు డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 1998డీఎస్సీ టీచర్ల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటిపల్లి రాంబాబు, జిల్లా గౌరవ అధ్యక్షుడు నేరెళ్ల సత్యనారాయణ, సభ్యులు డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

### 80 కిలోల రెండు టేకు చేపలు



అంతర్వేది, ఆగస్టు 2: అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బరులో మత్స్యకారుల వలకు చిక్కిన రెండు టేకు చేపలకు వేలం పాట నిర్వహించారు. 80కిలోలు ఉన్న టేకు చేపలు ఒక్కింటినీ రూ.8వేలు చొప్పున రూ.16వేలకు కొనుగోలు చేశారు. హార్బరు అంతా ఇతర రకాల చేపలతో సందడిగా మారింది. గోదావరి వరద పోటు నీరు సముద్రంలో కలవడం వల్ల చేపలు వలలకు చిక్కుతున్నాయని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు.

## విశాఖపట్నం వెళ్లి పింఛన్ అందజేత



వైజాగ్ ఆసుపత్రితో పింఛన్ అందిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, ఆగస్టు 2: కపిలేశ్వరపురానికి చెందిన పి.జయలక్ష్మి విశాఖపట్నం ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నారు. వీఆర్వో పలివెల జేజిబాబు ఆసుపత్రికి వెళ్లి రూ.10వేలు పింఛన్ ఆమెకు అందజేశారు. వీఆర్వో జేజిబాబును గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, తోటి ఉద్యోగులు అభినందించారు.

**మామిడికుదురు:** ఈదరాడకు చెందినయెరుబండి పట్టాభిరామయ్య పెదమాచరి కాకినాడలోని సుధా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ వినయ్ శుక్రవారం కాకినాడ వెళ్లి ఆయనకు పింఛన్ అందించారు. వినయ్‌ను సర్పంచ్, స్థానికులు అభినందించారు.

**పి.గన్నవరం:** నాగుల్లంక శివారు బాడవ కాల్వ గట్టుకు చెందిన దివ్యాంగురాలు శిరిగినీడి వెంకటలక్ష్మి అనా రోగ్యంతో రాజమహేంద్రవరంలోప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. వెల్ఫేర్ అసిస్టెంట్ బొబ్బర దుర్గాప్రసాద్, సర్పంచ్ భర్త, జనసేన నాయకులు యల్లమిల్లి చిట్టి బాబులు శుక్రవారం ఆమెకు రూ.6వేలు పింఛన్ అందించారు.

**ముమ్మిడివరం:** అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాదిరాజు వెంకటసుబ్బలక్ష్మికిశుక్రవారం సచివాలయ కార్యదర్శి శ్రీనివాస్ ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశారు. దివి విజయ్, పీవీ సీతారామరాజు పాల్గొన్నారు.

**ఆత్రేయపురం:** నార్కెడిమిల్లికి చెందిన కోపెల్ల వెంకటరత్నం కాలుకి ఆపరేషన్ చేయించుకుని రాజమహేంద్రవరం విజయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం సచివాలయ ఉద్యోగి బాలకృష్ణ ఆసుపత్రికి వెళ్లి ఆమెకు రూ.6వేలు పెన్షన్‌ను అందజేశాడు.

**అంబాజీపేట:** పుల్లేటికుర్రుకు చెందిన బొరుసు వెంకటేశ్వరరావు రాజమహేంద్రవరం బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సచివాలయ వేల్ఫేర్అసిస్టెంట్ జి.బాలు ఆసుపత్రికి వెళ్లి పింఛన్ రూ.4వేలు అందించారు.

### ఆశావర్కర్లకు వేతనాలు పెంపు

యానాం, ఆగస్టు 2: పుదుచ్చేరి వ్యాప్తంగా ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు ఇచ్చే వేతనం రూ.6వేల నుంచి రూ.10వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఆశావర్కర్లకు, డైలీవేజ్ ఉద్యోగులకు వేతనాలు పెంచిన సీఎం ఎన్.రంగాసామి, గరవ్నర్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, ఆరోగ్యశాఖ కార్యాదర్శి, డైరెక్టర్లకు మల్లాడి కృతజ్ఞతలు తెలిపారు.

### పీఆర్టీయూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



జిల్లా విద్యాశాఖాధికారిణికి ఆర్వో ప్లాంటు అందజేస్తున్న పీఆర్టీయూ జిల్లా శాఖప్రతినిధులు

ముమ్మిడివరం, ఆగస్టు 2: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ (ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్) జిల్లాశాఖ ప్రతినిధులు జిల్లా విద్యాధికారిణి ఎం.కమలకుమారికి నివేదించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల ప్రాంగణంలో ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పీఆర్టీయూ జిల్లాశాఖ ప్రతినిధులంతా వెళ్లి వివిధ ఉపాధ్యాయ సమస్యలపై డీఈవోకు వివరించారు. ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు డి.సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి వాడ్రేవు శ్రీనివాస్, ఎం.అమృతరావు, టీవీఎస్ఎస్ తిలక్‌బాబులతో పాటు పలువురు డీఈవోను కలిసి తమ శాఖ తరుపున ఆర్వో ప్లాంటును అందజేశారు. కార్యక్రమంలో కె.చంద్రశేఖర్, పద్మనాభం, అప్పారి రామకృష్ణ, డీవీఆర్ సుబ్రహ్మణ్యం, పిల్లి హేమసుందర్, ఎస్.శ్రీనివాసరావు, భీమశంకరం, సత్యనారాయణ, పల్లవరాజు, నాయుడు పాల్గొన్నారు.

### నేడు మాచవరంలో వైద్య శిబిరం

అమలాపురం టౌన్/అంబాజీపేట, ఆగస్టు 2: లీగల్ లిటరసీ క్యాంపుల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సౌజన్యంతో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అంబాజీపేట మండలం మాచవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వి.నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు.

### బీవీసీలో అవగాహన సదస్సు

అల్లవరం,ఆగస్టు2: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు శుక్రవారం నిర్మాణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీఏఎస్ చంద్రమౌళి, విద్యావేత్త బళ్ళ పీఎస్ మల్లికార్జునరావు, ఏ.ప్రవీణ్, శ్రీపాద రామకృష్ణ పాల్గొన్నారు.

### సినిమా గైడ్

**అమలాపురం**

| | |
|---|---|
| వెంకటరమణ | : శివం భజే |
| శ్రీలలిత | : తిరగబడరా సామి |
| శేఖర్ స్క్రీన్-1 | : బడ్డీ |
| శేఖర్ స్క్రీన్-2 | : అలనాటి రామచంద్రుడు |
| రమా | : రాయన్ |
| గణపతి | : హరోం హర |
| వెంకటపద్మావతిస్క్రీన్-1 | : కల్కి |
| వెంకటపద్మావతి స్క్రీన్-2 | : డెడ్ పూల్ |

### సుప్రీం తీర్పు చారిత్రాత్మకం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర జోనల్ ఇన్‌చార్జి పలివెల రాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద బాబు జగ్జీవనరామ్ విగ్రహానికి పలివెల రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు వర్గీకరణ ఆయా రాష్ట్రాల పరిధిలో జరపాలని తీర్పు ఇవ్వడం రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలో ఉండటం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, మాదిగ నాయకులు పాల్గొన్నారు.

### పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

మలికిపురం, ఆగస్టు 2: మండలంలోని అన్నిప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలపై ఎంఈవో ఎం.విజయశ్రీ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో విజయశ్రీ మాట్లాడుతూ ఈనెల1నుంచి 8వరకు యాజమాన్య కమిటీల ఎన్నికలప్రక్రియ సాగుతుందన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా హెచ్‌ఎంలు చర్యలు చేపట్టాలన్నారు. యూటీఎఫ్, ఎస్టీయూ, పీఆర్టీయూ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఆర్.శేఖర్, ఆర్.రవి, సీఆర్పీలు పాల్గొన్నారు.

### రాష్ట్ర చెస్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక

అమలాపురం టౌన్, ఆగస్టు 2: కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం విక్టరీ అకాడమీలో అండర్-7 చెస్ పోటీలను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఏడేళ్ల లోపు చిన్నారులకు వేర్వేరుగా చెస్ పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో పి.అభిజ్ఞ ప్రథమ, గుబ్బల దార్వి ద్వితీయ స్థానాలు సాధించారు. బాలుర విభాగంలో పడాల శ్రీయాన్‌రెడ్డి ప్రథమ, అడబాల నికేష్ ద్వితీయ స్థానాలు సాధించారు. వీరు నలుగురు అండర్-7 రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. విజయనగరంలో త్వరలో రాష్ట్రస్థాయి చెస్ చాంపియన్ షిప్ పోటీలు జరుగుతాయన్నారు.

### నేత్ర దానం

రాయవరం, ఆగస్టు2: రాయవరానికి చెందినదళితనేత కన్నాబత్తుల ధర్మారాజు(62) శుక్రవారం మృతిచెందాడు. అతడి కార్నియాను దానం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. కాకినాడకు చెందిన ఐబ్యాంక్ సభ్యులు అతడి కార్నియాను సేకరించి తీసుకువెళ్లారు. ధర్మారాజు కుటుంబ సభ్యులను సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, వలంటరీ బ్లడ్‌డోనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెలగల ఫణికృష్ణారెడ్డి, పోలిమాటి సుధాకర్ అభినందించారు.

### ఎస్సీ వర్గీకరణకు మాలలంతా వ్యతిరేకం

అమలాపురం రూరల్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు మాలలంతా పూర్తిగా వ్యతిరేకమని మాలమహానాడు నాయకులు పేర్కొన్నారు. ఈదరపల్లిలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం మాలమహానాడు నాయకుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రాల అభిప్రాయం మేరకు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చునని సుప్రీంకోర్టు తీర్పు వల్ల సమన్యాయం సాధ్యం కాదని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని నాయకులు పేర్కొన్నారు. త్వరలోనే సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేయనున్నట్టు వెల్లడించారు. మాలమహానాడు రాష్ట్ర నాయకులు పండు అశోక్‌కుమార్, ఎంఏకే భీమారావు, జగడం సత్యనారాయణ, పెయ్యల పరశురాముడు, చీకురుమెల్లి కిరణ్ కుమార్, ములపర్తి సత్యనారాయణ, జల్లి శ్రీనివాస్, నాతి శ్రీనివాసరావు, చింతా రామకృష్ణ, నక్కా సంపత్‌కుమార్, పెయ్యల శ్రీనివాస్, రేవు తిరుపతిరావ పాల్గొన్నారు.

### సాగునీరందించేందుకు చర్యలు

రావులపాలెం, ఆగస్టు2: శివారు భూములకు నీటి సమస్యలు తలెత్తకుండా పూర్తి స్థాయిలో సాగునీరు అందించేందుకు ప్రణాళికలను రూపొందించామని ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పలు పంటకాల్వలను ఏఈ సత్యనారాయణతో కలిసి ఆయనపరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీరు ఇబ్బంది లేకుండా పంటకాల్వలను గుర్రపుడెక్కతూడు తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రజలు పంటకాలువల్లో చెత్తను వేయరాదన్నారు. కాలువలలో పూడిక తీత పనులకు టెండర్ పిలిచామని, అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

### గొల్లవిల్లి ప్రాజెక్టుకు జాతీయ గుర్తింపు



కుట్టి ఫ్లోర్ క్లీనర్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఉప్పలగుప్తం, ఆగస్టు2: అటల్ మారథాన్ ఇన్నోవేషన్ స్కీమ్‌లో దేశ వ్యాప్తంగాఎంపికైన 500ప్రాజెక్టుల్లో గొల్లవిల్లి హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన కుట్టి ఫ్లోర్ క్లీనర్-2కె24కు చోటు దక్కిందని హెచ్‌ఎం లంక రాణి తెలిపారు. వీల్‌చైర్‌కే పరిమితమైన వారికి, వృద్ధులకు పనులు చేసుకునేందుకు, నేలను శుభ్రం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. దీనిని మొబైల్ ద్వారా ఆపరేట్ చేయవచ్చని, దీనివల్ల డబ్బు, సమయం ఆదా అవుతాయని సైన్స్ ఉపాధ్యాయుడు అబ్బిరెడ్డి రామకృష్ణ వివరించారు. విద్యార్థులు ఎం.తనూష్‌తేజ, నూకల రేవతిదివ్యభాను ఈప్రాజెక్టును కల్పనాచావ్లా టీమ్ పేరుతో రూపకల్పన చేశారు. వీరిని ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ, హెచ్‌ఎం లంక రాణి, సైన్స్ ఉపాధ్యాయులు అబ్బిరెడ్డి రామకృష్ణ, అడబాల శ్రీనివాసరావు, నల్లా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

### ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

ముమ్మిడివరం, ఆగస్టు 2: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను ముమ్మిడివరం శ్రీకృష్ణదేవరాయ మహిళా జూనియర్ కళాశాల, సర్ డాక్టర్ రావుబహాదూర్ రఘుపతివెంకటరత్నం డిగ్రీ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ గణేశుల బ్రహ్మానందం, ప్రిన్సిపాల్ గంధం శ్రీరామమూర్తి, జగతా సురేష్, మల్లాడి నరసింహ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గుర్రం మహేష్, కానూరి సత్యశ్రీ, వంగా విశాల, ఆకుల దుర్గ పాల్గొన్నారు.

**మలికిపురం:** పింగళి వెంకయ్య జయంతిని శుక్రవారం మలికిపురం డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. జాతీయ స్ఫూర్తిని సూచించే విధంగా జెండాను రూపకల్పన చేసిన ఆయన్ను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.సతీష్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

**యానాం:** స్థానిక ఫెర్రిరోడ్డులోని పింగళి వెంకయ్య విగ్రహానికి యానాం పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

**రావులపాలెం:** జాతీయ పతాక రూపశిల్పి పింగళ వెంకయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన హిస్టరీ డిపార్టుమెంట్ అధ్యాపకులు సిద్ధార్థకుమార్ ఆధ్వర్యంలో వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

### నామన ఫౌండేషన్ ఆర్థిక సాయం

పి.గన్నవరం, ఆగస్టు 2: లంకలగన్నవరం శివారుడొక్కా సీతమ్మకాలనీకి చెందిన కొల్లు రవీంద్ర కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. మగటపల్లికి చెందిన నామన ఫౌండేషన్ సమకూర్చిన రూ.10వేలను శుక్రవారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, కూటమి నేతలు అతడికి అందించారు. కార్యక్రమంలో సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, శేరు శ్రీనుబాబు, ఆరుమిల్లి రాంబాబు, చిట్టాల రామజోగేశ్వరావు, లంకే చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

### సీసీఎఫ్ సొసైటీలను ప్రక్షాళన చేయాలి: ఎమ్మెల్యే

మలికిపురం, ఆగస్టు 2: రాజోలు నియోజకవర్గంలో ఉన్న సీసీఎఫ్ ఎఫ్ఎల్సీ సొసైటీలను ప్రక్షాళన చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్కులో సీసీఎఫ్ ఎఫ్ఎల్సీ జాయింట్ ఫార్మింగ్ సొసైటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 36సొసైటీలు ఉన్నాయని, ఇందులో సభ్యులుగా షెడ్యూల్డు కులాలవారు ఎక్కువగా ఉన్నారన్నారు. సొసైటీ సభ్యులు చనిపోయినవారి స్థానంలో వారసులకు పట్టాలు ఇవ్వాలన్నారు. సొసైటీల పరంగా భూముల వివరాలు స్పష్టంగా ఉండాలని, ఆ భూముల్లో ప్రస్తుత పంటల వివరాలు, వాటి పరిస్థితి తెలియజేయాలన్నారు. చాలాచోట్ల సొసైటీల్లో అవకతవకల వల్ల వివాదాలు ఏర్పడుతున్నాయని, అటువంటి సమస్యలు లేకుండా సమష్టిగా ముందుకు వెళ్లాలన్నారు. సమావేశంలో జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ ఎస్.మురళీకృష్ణ, డివిజన్ కోఆపరేటివ్ ఆఫీసర్ ఎ.రాధాకృష్ణ, రాజోలు సబ్‌డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ ఏసునాయన, వివిధ సొసైటీల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, జనసేన నాయకులు గుండుబోగుల పెద్దకాపు, పినిశెట్టి బుజ్జి, తెలుగుదేశం నాయకులు చాగంటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

### పీర్లు ఊరేగింపు

మామిడికుదురు, ఆగస్టు 2: షియా మతస్తుల ఆరాధ్య దైవం హజరత్ఇమామ్‌హుస్సేన్, హజరత్ అబ్బాస్, బీబీషకీనా సంతాప కార్యక్రమాలు శుక్రవారం జరిగాయి. ఈసందర్భంగా బార్లపేకమ్రే బన్నిహాసిం పంజాలో మజ్లిస్ జరిగింది. మజ్లిస్ అనంతరం పంజా నుంచి పీరును తీసి మాతం నిర్వహిస్తూ ఊరేగింపు జరిపారు. కార్యక్రమాలు మొల్లా అబ్బాస్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగాయి. మత ప్రబోధకుడు సయ్యద్‌షబాబ్ హైదర్ మజ్లిస్ ఆలపించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది.

### కళాశాల అభివృద్ధికి సహకరించాలి

మామిడికుదురు, ఆగస్టు 2: మామిడికుదురు ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి సహకరించాలని శుక్రవారం ఎమ్మెల్యే దేవవరప్రసాద్‌ను కళాశాల సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. కళాశాలలో ల్యాండ్ ఫిల్లింగ్ చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరినట్టు ప్రిన్సిపాల్ ఏసుబాబు తెలిపారు. సిబ్బంది, టీడీపీ నాయకులు ఉండ్రు శ్రీరామారావు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ బోల్తా, డ్రైవర్ సురక్షితం

పి.గన్నవరం, ఆగస్టు 2: సిమెంటులోడుతో వెళ్తున్న ట్రాక్టరు పంట కాల్వలోకి దూసుకువెళ్లింది.మల్లాయపాలానికి చెందిన జి.సతీష్ తన ట్రాక్టరుపై 80 సిమెంట్ బస్తాలను కిరాయికి వేరేఇంటికి తీసుకెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పంటకాల్వలోకి దూసుకుపోయింది. ఇంజన్, ట్రక్కు తిరగబడటంతో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. సిమెంటు బస్తాలు నీటిపాలయ్యాయి.

### పర్సు అందజేత

ముమ్మిడివరం, ఆగస్టు 2: ఠాణేలంక పెదపేటకు చెందిన నాతి నాగేశ్వరరావు కాకినాడ వెళ్లి తిరిగి వస్తుండగా యానాం వద్ద పర్సును పడవేసుకున్నాడు. కాకినాడ నుంచి ఇంటికి వస్తున్న ఐ.పోలవరం మండలం కేశనకుర్రుకుపాలేనికి చెందిన విత్తనాల సురేష్‌కు ఆ పర్సు దొరికింది. అతడు ఆ పర్సును నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి అందజేశాడు. పర్సులో నగదు, ఏటీఎం కార్డులు ఉన్నాయి. సురేష్‌కు నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### తాటాకిల్లు దగ్ధం

ఉప్పలగుప్తం, ఆగస్టు2: చినగాడవిల్లి రామాలయంపేటలో గురువారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెనుమాల వెంకటేశ్వరరావుకు చెందిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఎనిమిది మంది కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో రోడ్డునపడ్డారు. ధాన్యంసొమ్ము రూ.లక్షసామగ్రి, దుస్తులు కాలిపోయ్యాయి. రెవెన్యూ సిబ్బంది ప్రమాదస్థలాన్ని సందర్శించి, బియ్యం అందించారు.